ప్రజాశక్తి

ఆదివారం 9 జులై 2023

5

అల్లూరి సీతారామరాజు

కొత్తపల్లి జలపాతం కిటకిట

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో శనివారం కిటకిట లాడింది. శని, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో మైదాన ప్రాంతాల నుండి పర్యాటకులు అధికంగా కొత్తపల్లి జలపాతాన్ని తిలకించేందుకు తరలి వచ్చారు. పర్యాటకులు అధికంగా వస్తున్నప్పటికీ వారికి సరిపడా సౌకర్యాలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

జలాశయం వద్ద పర్యాటకులు

అటవీ ఉత్పత్తులకు గిరాకీ

-మన్యంలో స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులు

-పాడేరులో వన్ దన్ మార్ట్‌లో రిటైల్‌గా లభ్యం

- అందుబాటులో నాణ్యమైన చిరుధాన్యాలు, రాజ్మా

పాడేరులోని వన ధన్ మార్ట్

ప్రజాశక్తి - పాడేరు:ప్రధానంగా గిరిజన రైతులు ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. గిరిజనులు ఉత్పత్తి చేసే కాఫీ, పసుపు, అల్లం, మిరియాలు, జీడిపప్పు చింతపండు, రాజ్మా ఎరుపు, తెలుపు చిక్కుళ్ళు, రాగులు, సామలు, కొర్రలు, వంటి ఆహార పంటలతో పాటు అడవి నుంచి సేకరించే కొండ చీపుర్లు, తేనె, కరక్కాయలు, పాల పిండి, సీకాయ, అడ్డాకులు వంటి అటవీ ఉత్పత్తులకు ఎంతో గిరాకీ ఉంది. ప్రతి ఏడాది పాడేరు ఏజెన్సీ నుంచి ఈ అటవీ వ్యవసాయ గిరిజన ఉత్పత్తులు మైదాన ప్రాంతాల్లోని మార్కెట్లకు, ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. వీటిని వ్యాపారులు సంతల్లో గిరిజనుల నుంచి కొనుగోలు చేసి నేరుగా మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. వినియోగ దారులు వీటిని సేకరించుకోవాలంటే వారపు సంతలకు వెళ్లి నేరుగా గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. ఈ ప్రాంతంలో వినియోగదారులకు ఈ అటవీ వ్యవసాయ ఉత్పత్తులను గ్రేడింగ్ చేసి మంచి ధరకు ఐటీడీఏ అందుబాటులోకి తెచ్చింది. గిరిజనులు పండించే స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను సరసమైన ధరలకు విరివిగా వెలుగు ద్వారా నిర్వహిస్తున్న వన్ దన్ కేంద్రాల ద్వారా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులతో పాటు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వన్ దన్ కేంద్రం ద్వారా గిరి ఉత్పత్తుల విక్రయానికి ఐటీడీఏ శ్రీకారం చుట్టడంతో వినియోగదారులకు సౌలభ్యం ఏర్పడింది. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో లభ్యమయ్యే గిరిజన ఉత్పత్తుల సేకరణకు వెలుగు శాఖ ద్వారా గిరిజన రైతుల భాగస్వామ్యంతో వన్ దన్ కేంద్రాలను వందకు పైగా ఏర్పాటు చేశారు. ఈ వన్‌త దన్ కేంద్రాలలో మహిళలు పురుషులు కలిపి 300 మంది చొప్పున సుమారు 30 వేల మంది గిరిజన రైతులను భాగస్వామ్యం చేసి అటవీ వ్యవసాయ ఉత్పత్తులను సేకరిస్తున్నారు. ఒక్కొక్క వన్ దన్ కేంద్రానికి రెండున్నర లక్షల చొప్పున ఆర్థిక తోడ్పాటును ఐటిడిఏ అందిస్తోంది. ఈ విధంగా రిటైల్ మార్కెటింగ్‌తో గిరిజన రైతుల ఆదాయం పెంచేందుకు గిరి ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఐటిడిఏ చేపట్టిన ఈ కార్యక్రమం సఫలమవుతోంది. గ్రామాల్లోని వన్ దన్ కేంద్రాల ద్వారా సహకరించే గిరిజన వ్యవసాయ అటవీ ఉత్పత్తులను పాడేరులో ఉన్న ప్రధాన వన్ దన్ కేంద్రంలో గ్రేడింగ్ చేసి ఆకర్షనీయంగా ప్యాకింగ్ చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నాణ్యమైన రీతిలో వీటిని వినియోగదారులకు మార్కెట్లో విక్రయించగలు గుతున్నారు. ముఖ్యంగా పసుపు, రాజ్మా చిక్కుళ్ళు, కాఫీ, మిరియాలు, అడవి తేనె, పాల పిండి, అడ్డాకుల ప్లేట్లు, కొండ చీపుర్లు, జీడిపప్పు సికాయ పౌడర్, చింతపండు, రాగి పిండి, రాగులు, సామలు, కొర్రలు, వంటి చిరుధాన్యాలు అరకిలో ప్యాకెట్లలో వినియోగదారులకు లభ్యమవుతున్నాయి. నాణ్యమైన ఈ గిరిజన ఉత్పత్తుల విక్రయంపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరు మెయిన్ రోడ్డులోనే ఏర్పాటు చేసిన ఈ వన్ దన్ కేంద్రం అందర్నీ ఆకర్షిస్తూ వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఎన్నో పోషక విలువలు ఉన్న ఈ ఆర్గానిక్ గిరిజన ఉత్పత్తుల వినియోగంతో కాల్షియం లోపం నివారణ మధుమేహం, రక్తపోటు, నియంత్రణ వంటి ఉపయోగాలను వెలుగు అధికారులు వినియోగదారులకు వివరిస్తూ వీటి విక్రయాలను చేస్తున్నారు.

అటవీ ఉత్పత్తులు

విజేత జట్టుకు మెగా టోర్నీ కప్‌ను అందజేస్తున్న ఎంపిటిసి, సర్పంచ్ తదితరులు

ముగిసిన జెఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్

- విన్నర్‌గా ములకపల్లి, రన్నర్‌గా టేకుపల్లి జట్లు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని జీడిగప్ప పంచాయితీ పరిధి రాయిగూడెం క్రీడా మైదాంలో పది రోజుల పాటు నిర్వహించిన జెఆర్ మోగా క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం టేకుపల్లి, విఆర్.పురం మండలం ములకపల్లి జట్లు తలపడగా.., ములకపల్లి జట్టు విజేతగా నిలించింది. విన్నర్, రన్నర్ జట్లకు జీడిగప్ప ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మూట్ల బాలరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేత ములకపల్లి జట్టు కెప్టెన్ గోవర్ధన్‌కు మెగా టోర్నీ కప్‌ను, రూ.15వేలు నగదు బహుమతి, రన్నర్ టేకుపల్లి జట్టు కెప్టెన్ వేట్ల అబ్బాయి రెడ్డికి సీల్డ్, రూ.10వేలు నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నేడు యువత అనేక చెడు వ్యసనాలకు బానిసై వక్ర మార్గాలు వైపి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిగుప్ప పంచాయితీలో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీయాలని పిలుపినిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహేష్, ఎన్.కన్నారావు, ఎస్.రాజేష్, పి.మురళీకృష్ణ, ఎన్.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహాలను సురక్షితంగా

ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి కొయ్యూరు

ఏజెన్సీలో జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా చాలా ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలు తొలగింపబడడం, ధ్వంసం కావడం జరుగుతుందని, అలా చేయకుండా వాటిని సురక్షితంగా తీసి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. శనివారం ఆయన సంఘం నాయకులు శ్యామల వరలక్ష్మి, మాకాడ బూరుగులయ్యలతో కలిసి మండలంలోని కాకరపాడు సెంటర్లో ఉన్న అల్లూరి నిలువెత్తు విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని హైవే వారు తొలగించాలని చూస్తున్నారని, అల్లూరి చరిత్రంతా కొయ్యూరు మండలంలో జరిగిందని, ఈ మండలానికి ముఖద్వారంగా ఉన్న కాకరపాడులో ఉన్న అల్లూరి విగ్రహానికి ప్రాధాన్యత ఉన్నదని తెలిపారు. కనుక ఆ విగ్రహాన్ని అక్కడ నుండి తొలగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని, అదే సెంటర్‌లో గతంలో యూకో బ్యాంకు నిర్వహించబడిన శిథిలమైన భవనం వద్ద సురక్షితంగా, శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కోరారు. అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో తమ సంఘానికి ఐదు సెంట్లు స్థలాన్ని కేటాయిస్తే ఉద్యానవనం, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్, పిఓకు పడాల విజ్ఞప్తి చేశారు.

వైఎస్ఆర్ పంటల బీమాతో రైతులకు లబ్ధి

- జిల్లాలో 1623 మంది రైతులకు రూ.2.51 కోట్ల బీమా పరిహారం

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: కరువు ప్రాంతాలలోని వర్షా భావ పరిస్థితులలో పంట నష్టపోయిన రైతులకు వై.యస్.ఆర్ ఉచిత పంట బీమా పథకంతో ఎంతో లబ్ధి చేకూరుతుందని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కాఫీ హౌస్‌లో జరిగిన రైతు దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయం మరింత అభివృద్ధి చెందాలని, ఇది రైతుల అవగాహన, ఆసక్తి వల్లనే సాధ్యమని అభిప్రాయం వ్యక్త పరిచారు. జిల్లాలో కాఫీ, మిరియాలు, పసుపు, రాజ్మా ప్రధాన పంటలని, మిగిలిన పంటలపై రైతులు ఆసక్తి పెంపొందించుకొని అవగాహనతో పంటలు పండించాలని సూచించారు. మార్కెటింగ్ పై అవగాహనా కలిగి ఉండాలన్నారు. మధ్య దళారీలు లేకుండా రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేసుకోవడంతో మంచి ధరకు పంటలను అమ్ము కోవచ్చన్నారు. జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాలలో పంటలు పండిస్తుండగా, 1.46 లక్షల ఎకరాలకు రైతు భారోసా అందిస్తున్నామన్నారు. గత ఏడాది 2.75 లక్షల ఎకరాలకు ఇ-క్రాప్ చేశామని, మిగిలిన 25 వేల ఎకరాలకు కూడా ఈ ఏడాది ఇ-క్రాప్ చేయాలని సూచించారు. అవసరమైన చెక్ డ్యాముల నిర్మాణానికి ప్రతిపాదిస్తే మంజూరు చేస్తామని కలక్టర్ వెల్లడించారు. వై. యస్. ఆర్ ఉచిత పంట భీమా కింద జిల్లాలోని 1,623 మంది రైతులకు రూ.2,50,97,036 ముఖ్యమంత్రి డిబిటి పద్ధతి ద్వారా రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 4,802 మంది రైతులకు రూ. 6.97 కోట్లు లబ్ది చేకూరిందని వివరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, వైఎస్. రాజశేఖర్ రెడ్డి రైతు భాందవుడని, అదే బాటలో తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నడుస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వ్యవసాయానికి పెద్ద పీట వేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా ఇ-క్రాప్ చేయించు కోవాలని, తీసుకున్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీలు పొందాలని సూచించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కలక్టర్, ఎంఎల్ఏ, ఇతర అతిధులు వైఎస్ రాజ శేకర్ రెడ్డి జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. అనంతరం పంట నష్ట పరిహారం చెక్కును లబ్దిదారులకు అందజేశారు. వ్యవసాయ స్టాళ్లను వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్ పర్సన్ సరస్వతి, ఎంపిటిసి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాదికారి బిఎస్ఎస్ నందు, జిల్లా ఉద్యాన అధికారి రమేష్, పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ బోకేలకు కలెక్టర్ ఫిదా

పాడేరు:సాంప్రదాయ బోకేలను అందుకున్న జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ వాటిని చూసి ఆనంద పరవశమయ్యారు. రైతు దినోత్సవం పురష్కరించుకొని స్థానిక కాఫీ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కలక్టర్‌ను వేదిక మీదకు ఆహ్వానించిన సందర్భంలో కమ్యూనిటి బేస్డ్ నేచుర్ ఫార్మింగ్ సభ్యులు అందించిన ప్రకృతి సిద్ధమైన ఫల పుష్పాలతో తయారు చేసిన బోకేలను అందజేశారు. వీటిని పరిశీలించిన కలక్టర్ ఫిదా అయ్యారు. శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి, తయారీదారులైన నేచుర్ ఫార్మింగ్ సభ్యులతో కాసేపు ముచ్చటించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. శాసన సభ్యురాలు వివరిస్తూ నిజానికి ఒకటి పైనాఫిల్ పండును బొకే మాదిరి ఆకులతోనూ, రెండోది పసుపు పువ్వును బోకే మాదిరి ఆకులతో అలంకరించారని, వీటిని వెదురు బొంగులో ఉంచి అందజేశారని వివరించారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి ధీరజ్

చోరీ కేసులో..

నిందితులకు రిమాండ్ : ఎఎస్‌పి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట గ్రామంలో గత నెల 5న జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఐదుగురు దొంగలను అరెస్టు చేసినట్లు అల్లూరి జిల్లా ఏఎస్పి కె.ధీరజ్ తెలిపారు. శనివారం అరకులోయ పోలీస్ స్టేషన్లో ఏఎస్పీ కె.ధీరజ్ మీడియాతో మాట్లాడుతూ, మండలంలోని సుంకరమెట్ట గ్రామానికి చెందిన పాంగి సురేంద్ర ఇంటికి గత నెల 10న అర్ధ రాత్రి 12.30 సమయంలో గుర్తు తెలియని గొంగలు ఇంట్లో చొరబడి బీరువా పగలగొట్టి లక్ష ఇరవై వేల నగదు, రెండు తులాలు బంగారం దొంగిలించి పారిపోయారని అన్నారు. పాంగి సురేంద్ర పిర్యాదు మేరకు అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న గాలిస్తుండగా శనివారం నిందితులను మండలంలోని పద్మపురం పంచాయితీ రాజధాని జంక్షన్ వద్ద అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్రశేఖర్, ఎస్సై సంతోష్, సిబ్బంది చూడగా ఐదుగురు నిందితులు పోలీసులను చూసి పారి పోవడానికి ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకొని విచారించామన్నారు. ఈ కేసులో దొంగలు బాధిత ఇంట్లో చొరబడి నుదుటిపై రాడ్ తో కొట్టి ఇంటివాళ్ళకు భయభ్రాంతులకు గురి చేసి నగదు, బంగారం వస్తువులను దొంగలించి పారిపోయినట్లు తెలిపారు. అప్పటినుండి పోలీసుల వారి కోసం వెతుకుతుండగా శనివారం ఖచ్చితమైన సమాచారం వచ్చినందున అరుకు సీఐ, ఎస్సై సిబ్బందితో నిందితులను పట్టుకొని విచారించగా వారి వద్ద 5000 నగదు, రెండు తులాల బంగారం, రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు, బొలోరా జీప్, స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో రంగీలా, పరశురామ్‌లు ఒడిశా రాష్ట్రానికి చెందినవారని, నందుల గంగులు, గెమ్మెలి గంగన్న, కొర్ర అప్పారావు అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ ప్రాంతాల వారని తెలిపారు.ఇంకో పది మంది ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వారిని అరెస్ట్ చేయవలసి ఉందని తెలిపారు. అరకు సీఐ, ఎస్ఐ సిబ్బందికి ఏఎస్పి ధీరజ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

- సిపిఎం సర్పంచ్ రూతు చొరవపై హర్షం

ప్రజాశక్తి అనంతగిరి:గత కొన్నేళ్ళుగా గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్న తాగు నీటి సమస్య పరిష్కారమైంది. మండలంలోని అనంతగిరి పంచాయితి మద్దిగారు గ్రామంలో సిపిఎం సర్పంచ్ సొమ్మెల రూతు పంచాయితీ నిధులు సుమారు మూడు లక్షలతో గ్రావిటి పథకం కింద పైపు లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయితీ పరిధి గ్రామాలలో నెలకొన్న తాగునీటి, రహదారి వంటి పలు సమస్యలు పరిష్కరించామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమ్మెల నాగులు, వార్డు మెంబర్ సభ్యులు జె సుబ్బారావు, జె.రామన్న గ్రామస్థులు సుబ్బారావు, దామోదర్, రాము, తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అనంతబాబు బహిరంగ సభపై నిరసన

ప్రజాశక్తి- కూనవరం

దళితుడైన తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో జైలు నుండి షతరులతో కూడిన బెయిల్‌పై బయటకొచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబు కూనవరం మండల కేంద్రంలో ఆదివారం బహిరంగ సభ ఏర్పాటు చేయడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కూనవరం మండలానికి అనంతరం బాబు రాకను వ్యతిరేకిస్తూ శనివారం మండల కేంద్రంలో అఖిలపక్షం పార్టీలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నిర్వసిత ప్రాంత ప్రజలను అనంతబాబు ఏనాడూ పట్టించుకోలేదని, ముంపు మండలాలకు ఏమి న్యాయం చేశారని ఇక్కడ బహిరంగ సభ పెడుతున్నారని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులకు గతంలో రూ.5లక్షలు ఇచ్చిన భూములకు రూ.10.50లక్షలు ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి నిర్వసితులను మోసం చేశారని గుర్తు చేశారు. కిందటి ఏడాది వచ్చిన వరదలకు ఈ ప్రాంత ప్రజలు పూర్తిగా మునిగితే ఎటువంటి సహాయం అందించలేదన్నారు. జిఒ నెంబర్ 3ను రద్దు వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే కనీసం స్పందించలేదని, దాని పునరుద్ధరించడానికి ప్రభుత్వంపై ఎటువంటి ఒత్తిడి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తి ఏ మోహం పెట్టుకొని ఇక్కడ బహిరంగ సభ పెడుతున్నాడని ప్రశ్నించారు. అధిక సంఖ్యలో జనాన్ని పోగేసి తన బలాన్ని నిరూపించుకొని తను చెప్పిన వారికే మళ్ళీ ఎమ్మెల్యే సీటు కట్టబెట్టడానికే ఇదంతా చేస్తున్నాడని ఆరోపించారు. తనే వ్యక్తిని చంపానని ఒప్పుకున్న వ్యక్తికి బహిరంగ సభకు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, అఖిలపక్ష పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు యడవల్లి భాస్కర్, పొడియం అప్పారావు, పాయం వెంకయ్య, నోముల రామారావు, వెంకటరమణ, రంజిత్ కుమార్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన చేస్తున్న అఖిలపక్ష పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు

శిథిలావస్థలో రక్షిత మంచినీటి పథకం

తాగునీటికి ఇబ్బంది పడుతున్న కరుదేవుపాలెం గిరిజనులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చికిలింత పంచాయితీ కరుదేవ్‌పాలెం గ్రామంలో రక్షిత తాగునీటి పథకం శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ గ్రామ గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరుదేవుపాలెం గ్రామంలోని సుమారు150 కుటుంబాలకు చెందిన 600 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో ఆరు చేతిపంపులు ఉండగా వాటిలో 3 సక్రమంగా పనిచేయడం లేదు. సుమారు 15 ఏళ్ల కిందట ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 10వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. నేడు అది శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి కింద పడుతున్నాయి. వాటర్ ట్యాంక్‌లో నీరు లీకై వృధాగా పోతుండడంతో గ్రామానికి సక్రమంగా తాగునీరు అందడం లేదు. వాటర్ ట్యాంకులో నీరు అపరిశుభ్రంగా ఉండడంతో దానిని క్లీన్ చేద్దామన్న శిథిలావస్థకు చేరుకోవడంతే పైకి ఎక్కితే ఏ ప్రమాదం జరుగుతుందోనని గిరిజనులు భయపడుతున్నారు. అపరిశుభ్రమైన నీరు వాడడం వలన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల ఇబ్బందులు నేపథ్యంలో అధికారులు స్పందించి తక్షణమే గ్రామంలో కొత్త వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని కోరుతున్నారు.

కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించాలి

కరుదేవుపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరి గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే గ్రామంలో కొత్త వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలి.

- కొండ్ల సూరిబాబు, చికిలింత సర్పంచ్.

శిథిలావస్థకు చేరిన రక్షిత తాగునీటి పథకం ఇదే..

ఎటిఎంలో నగదు లేక నిరీక్షిస్తున్న వినియోగదారులు

పని చేయని ఎటిఎం

- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులోని యూనియన్ బ్యాంక్ ఎటిఎం తరచూ మరమ్మతులకు గురి కావడంతో ఖాతాదారులు, వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏటీఎం ఎప్పుడు పని చేస్తుందో ఎప్పుడు పని చేయదో తెలియని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు అంటున్నారు. ఏటీఎం తరచూ మరమ్మతులకు గురికావడంపై అనేకసార్లు బ్యాంకు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు సెలవు దినాల్లో ఏటీఎం పనిచేయకపోతే నగదు కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నగదు తీసుకోవడానికి డిపాజిట్ చేయడానికి ఒక్క ఏటీఎం మాత్రమే ఉండడంతో అనేక సమస్యలకు గురు కావలసి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడం, ఏటీఎం పనిచేయకపోవడంతో సీలేరులో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏటీఎం పని చేసేలా, ప్రతిరోజు నగదు పొందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పలకజీడి గ్రామాన్ని సందర్శించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని పలకజీడి గ్రామాన్ని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ శుక్రవారం సందర్శించారు. సంతకు వచ్చిన గొందికోట, ఎండకోట, బంగారు బంద, నక్కలమెట్ట తదితర మారుమూల గ్రామాల ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. ఆయన వెంట సిఐ ఎ.స్వామినాయుడు, మంప ఎస్సై లోకేష్ కుమార్ ఉన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రతాప్ శివ కిశోర్

పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యం

ప్రజాశక్తి-ఉక్కునగరం : పోరాటాలతోనే విశాఖ ఉక్కు పరిరక్షణ సాధ్యం అని పోరాట కమిటీ ప్రతినిధి జె.రామకృష్ణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 877వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆర్ఎంహెచ్‌పి, ఎస్ఎంఎస్, హెచ్ఆర్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి జె.రామకృష్ణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా చేయతలపెట్టిన ఐక్య ఉద్యమాలతోనే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదుర్కోవచ్చని తెలిపారు. గత తొమ్మిదేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తూ, వాటిని కార్పొరేట్ పెద్దలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసేందుకు సొంత గనులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో మాత్రమే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ మద్దతిచ్చే పార్టీలను 2024లో గెలిపించుకుంటే ప్రభుత్వ రంగ పరిశ్రమలను, కార్మిక హక్కులను రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ దీక్షలో పోరాట కమిటీ ప్రతినిధులు జి.జయ, బిఎస్.రాజు, డిఎస్‌వివి.శ్రీనివాసరావు, వై.వి.రమణ, కార్మికులు పాల్గొన్నారు.

పోర్టు పెన్షనర్లకు 3 శాతం డిఎ

ప్రజాశక్తి -మధురవాద : పోర్టు పెన్షనర్లకు 3 శాతం డిఎ పెరిగినట్లు హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోతిన అప్పారావు తెలిపారు. శనివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు ఆదేశాల ప్రకారం పెన్షనర్లకు రావాల్సిన డ్రాఫ్ట్ ఇన్ పెన్షన్‌పై మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ ఉత్తర్వులు అందిన వెంటనే ఎరియర్స్ చెల్లించాలని కోరారు. పెన్షనర్లకు మెరుగైన వైద్యం, వైద్య పరీక్షలు అందించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.ప్రకాశరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'బిఎన్ఆర్'కు కుర్చీ బహూకరణ

ప్రజాశక్తి -మధురవాద : కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో క్లినిక్‌కు కుర్చీని మీనాక్షి కాంప్లెక్స్ డ్వాక్స్ అసోసియేషన్ ప్రతినిధి ఉప్పాలా బహూకరించారు. ఆమెకు బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రచయితలకు సత్కారం

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ పౌర గ్రంథాలయంలో కదరావలి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. కదరావలి సంస్థ అధ్యక్షులు డిఎస్‌వి.రామశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొని తెలుగు సాహిత్య సేవలందిస్తున్న కవులను, రచయితలను సన్మానించారు. అనంతరం గుండాల జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు రచనలకు సంబంధించి వివిధ విషయాలపై చర్చలు నిర్వహించారు. కొత్తగా రచనలు చేసే వారికి ప్రత్యేకంగా సలహాలు, మెళకువలను సూచించారు. తెలుగు కథా రచయితలలో ఒక కొత్త ఉత్సాహాన్ని అందించిందని, సమాజాన్ని మేలు కలుపుతూ మెరుగైన కథలలో రాయడానికి తోడ్పడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్.జగన్నాథశర్మ, చంద్రశేఖర్ ఆజాద్, శరత్చంద్ర, డాక్టర్ కోచ్ర, కోట జగదీష్, సిహెచ్ సుశీలమ్మ, జి.మల్లేశ్వర్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

1999 నాటి స్కీమ్ ఇళ్లను పూర్తిచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి బిటిఆర్ నగర్ రైల్వే వీధిలో 1999లో మంజూరైన స్కీమ్ ఇళ్లను పూర్తిచేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందరాజులు కోరారు. ఆ ఇళ్లు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో 10 మంది లబ్ధిదారులు రోడ్డు పక్కనే రేకుల షెడ్లలో నివసిస్తున్నారని హౌసింగ్ అధికారుల దృష్టికి కార్పొరేటర్ తీసుకెళ్లారు. హౌసింగ్ ఇఇ ఆర్.ప్రసంగరావు, ఎఇ ప్రభ వార్డులో పర్యటించి ఆ ఇళ్లను పరిశీలించారు. వీలైనంత త్వరగా ఈ నిర్మాణాలు చేపట్టి లబ్ధిదారులకు అందేలా చూడాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లువాడలో బీజామృతం తయారీపై శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం : తర్లువాడ గ్రామంలో డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంలో బీజామృతంతో విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి చక్రవర్తి ఆధ్వర్యాన డ్వాక్రా సభ్యులకు ప్రకృతి వ్యవసాయం పై పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల విత్తనాల మొలక శాతం పెరుగుతుందని, వ్యాధులను 45 రోజుల వరకు రాకుండా చేస్తుందని తెలిపారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బజార్‌లోని దుర్గాదేవి షెడ్లో రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, వైసిపి కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ నాయకులు బొర్రా కృష్ణ, వైసిపి కార్యకర్తలు వెంకట్రావు, బుజ్జి, స్వర్ణలత పాల్గొన్నారు.

కొయ్యూరు : వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దంపతులు ఆయనకు శనివారం ఘన నివాళులర్పించారు. విశాఖపట్నంలోని ఎంవిపి సెక్టర్‌లో ఉన్న అరకు ఎంపీ కార్యాలయంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి మాధవి, శివప్రసాద్ కలిసి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మాధవి దంపతులు

పాడేరు: వైయస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనకు కృషి చేయాలని పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి కోరారు. వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు పాడేరులో వైసిపి శ్రేణుల తో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం అనాథ చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజశేఖర్ రెడ్డి హయాంలో అనేక ప్రాజెక్టులను నిర్మించారన్నారు. రైతుల కంట కన్నీళ్లు రాకూడదన్న ఉద్దేశంతో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసి పూర్తి చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన జయంతిని పరిష్కరించుకొని రైతు దినోత్సవం నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. 108, ఆరోగ్యశ్రీ, అభయహస్తం పెన్షన్లు తదితర పథకాలు. రాజశేఖర్ రెడ్డి ప్రవేశా పెట్టారని కొనియాడారు. ఇందిరమ్మ ఇల్లు పేరిట ఎంతో మంది పేదలకు ఇళ్లను నిర్మించిన మహోన్నతుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరసింగరావు, అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ సరస్వతి, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, మండల కన్వీనర్ కోటి బాబు, మాజీ ఎంపీపీలు మంగ్లన్న దొర, రమణమూర్తి, జిల్లా పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షులు గబ్బాడ చిట్టి బాబు, ఎంపీటీసీలు నరసింహమూర్తి, సన్యాసిరావు, గిడ్డి విజయలక్ష్మి, చల్ల చిట్టమ్మ, సర్పంచులు వి రాంబాబు, ఎస్ లక్ష్మణరావు, కే సన్నీ బాబు, జి నీలకంఠం, వి బసవన్న దొర, ఎల్ పార్వతమ్మ. సీనియర్ నాయకులు కన్నా పాత్రుడు, దశమూర్తి,విశ్వ, సత్యనారాయణ, మహిళా నాయకులు కోడ సుశీల, లకే సత్యవతి, ఊర్వశి రాణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరులో....

డుంబ్రిగుడ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను స్థానిక మండల కేంద్రంలో వైసిపి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానికమ్మతో పాటు ఆ పార్టీ నాయకులు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్ ,మండల నాయకులు బి.సింహాచలం, వైసీపీ మండల కన్వీనర్ గణపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం ఇండియన్ ఆయిల్ బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఇండియన్ ఆయిల్ బంకు దగ్గరలో అపస్మారక స్థితిలో పడివున్నాడు. దీనిని గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్ వారి సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ ఆయన్ను పరీక్షించి సుమారు రాత్రి 12 గంటల సమయంలో చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుని వయస్సు 50 నుండి 55 సంవత్సరాలు ఉంటాయి. ఈ విషయంపై ఇన్‌ఛార్జి గ్రామ రెవెన్యూ అధికారి పరవాడ నాయుడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కసింకోట ఎస్సై ఎ.ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీతం డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాలకు నేడు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు ఆదివారం గీతం విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డిఎస్.రావు తెలిపారు. గీతంలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మశీ, నర్సింగ్, ఫిజియోథెరిపి తదితర వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్సీ, బిఎ, బికామ్ వంటి డిగ్రీ కోర్సులకు ఈ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్సీ బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరిపి, బిఫార్మశీతో పాటు బిఎ, ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు పారా మెడికల్ కోర్సులైన ఆప్టోమెట్రి, మెడికల్ ల్యాబ్‌టెక్నాలజీ, ఎమర్జెన్సి మెడికల్ టెక్నాలజీ, రీనల్ డయాలసిస్ టెక్నాలజీ కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. డిగ్రీ తత్సమాన అర్హత గల వారికి ఎమ్మెస్సీ డేటా సైన్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో ప్రవేశం పొందదలచిన వారు ఆదివారం జరిగే ప్రవేశాల కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావచ్చని సూచించారు.

రికార్డు స్థాయిలో అప్పన్న ఆదాయం

ప్రజాశక్తి-సింహాచలం: రెండవ శనివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వివిధ మార్గాల టికెట్ల ద్వారా అప్పన్నకు శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో సుమారు రూ.54 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గతంలో ఎన్నడూ సామాన్య రోజుల్లో ఒక్కరోజు ఆదాయం రూ.54 లక్షలు వచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. దర్శనాల ద్వారానే రూ.33 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

బెదిరింపులకు భయపడేది లేదు

ఐదో రోజు దీక్షలో గంగవరం పోర్టు కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : 'పోర్టు వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటూ, మూకుమ్మడిగా విధులు బహిష్కరించిన మీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని రిజిష్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపిస్తున్న యాజమాన్యంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. యాజమాన్యం బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టంచేశారు. కనీస వేతనం రూ.36 వేలు చేయాలని, బేసిక్ రూ.22 వేలుగా ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన దీక్షలు శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ, సంప్రదింపుల ద్వారా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం ఈ రకంగా కార్మికులను భయభ్రాంతులకు గురి చేయటం సమంజసం కాదన్నారు. 200 మందికి పైగా యాజమాన్యం నోటీసులు పంపించిందని, వాటిని కార్మికులు తిరస్కరించి వెనక్కి పంపించేశారని తెలిపారు. కార్మికులకు వ్యక్తిగతంగా ఇస్తున్న నోటీసులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతి రెడ్డి, అధ్యక్షులు డి.అప్పారావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.ఎల్లయ్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గంగవరం అదాని పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పోర్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు అత్యంత తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకోవడం తగదని పేర్కొన్నారు. అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సఫలం కాని చర్చలు

యాజమాన్యం పిలుపుమేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావుతో పాటు మరో 29 మంది కార్మికులు యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. ఈ సంప్రదింపుల్లో బేసిక్ రూ.22 వేలుగా ప్రకటించి కనీస జీతం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా విధుల నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, మెడికల్ పాలసీ ప్రకటించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని, బోనస్ తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు కార్మిక నాయకులు ఉంచారు. యాజమాన్యం దేనికీ ఒక స్పష్టత ఇవ్వలేదు. కలెక్టర్‌తో జరిగిన సంప్రదింపుల్లో ఆయన చేసిన సూచనలను కూడా పరిగణలోకి తీసుకునేలా మాట్లాడలేదు. జీతం 2024లో పెంచుతామని చెప్పారు తప్ప ఎంత అనేది స్పష్టత ఇవ్వలేదు. ఐడి కార్డులలో అదాని పేరు చేరుస్తామని చెప్పారు కానీ మెడికల్ పాలసీ, ఇతర సమస్యలపై స్పష్టత లేదు.

శాంతియుతంగా ఉద్యమం : ఎమ్మెల్యే

ఈ విషయంపై కార్మికులు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కలిశారు. ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ఆయన కార్మికులకు సూచించారు.

అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, ఉద్యమాన్ని అంచలంచలుగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మద్దతుగా 10 నుంచి నిరసనలు : సిఐటియు

కలెక్టరేట్ : ఆరు నెలలుగా సాగుతున్న గంగవరం పోర్టు కార్మికుల పోరాటానికి మద్దతుగా ఈ నెల 10 నుంచి 13 వరకూ నిరసనలు చేపడుతున్నట్టు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ వెల్లడించింది. తొలిరోజు గాంధీ విగ్రహం వద్ద సంఘీభావ కార్యక్రమం జరుగుతుందని, 11 నుంచి 13 వరకు కార్మికుల పని ప్రదేశాల్లో అదానీ గంగవరం పోర్టు యాజమాన్య నిర్లక్ష్యంపై అందరూ నిరసనలు తెలిపి పోరాటం చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలియజేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ ప్రవేశపెట్టారు. గంగవరం పోర్టులో పేరుకే పర్మినెంటు ఉద్యోగాలు తప్ప జీతభత్యాలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు బతకలేకున్నాయని తెలిపారు.

ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఒపిఎస్ కోసం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపిసిపిఎస్ఇఎ) రాష్ట్ర అధ్యక్షులు రొంగలి అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ - జిపిఎస్ వద్దని, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) మాత్రమే కావాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని వారు ప్రశ్నించారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోరుకొండ సతీష్, అధ్యక్షులు జి.సూర్యప్రకాష్, కార్యదర్శి గునూరు శ్రీను, మహిళా అధ్యక్షురాలు జి.రమాదేవి, విశాఖ అర్బన్ అధ్యక్షులు బి.దేముడు బాబు, ఉపాధ్యక్షులు ఐ.శ్రీనివాస్, ఎన్.భరత్ కుమార్, అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ఎపిటిఎఫ్ నాయకులు బి.వెంకటపతి రాజు (వేణు), రవి సిద్ధార్థ మద్దతు తెలిపారు.

గిరిజనులకు ఆదాయ వనరు పనస

ప్రజాశక్తి-కొయ్యూరు : పనస పండు రుచి అతి మధురంగా ఉంటుంది. పనస గిరిజనుల ఆదాయ వనరుతో పాటు ముఖ్యమైన ఆహారంలో కూడా. ఇది కాయగా ఉన్న సమయంలో పొట్టుకూర చేసుకొని తింటారు. పండిన తరువాత పనస తొనలు తినడంతో పాటు పనస పిక్కలను కూర చేసుకుంటారు. ఈ సీజన్‌లో పనస పండ్లను మైదాన ప్రాంతాల వారికి విక్రయించి ఆదాయం సమకూర్చుకుంటారు. మండలంలోని మారుమూల పంచాయతీ బూదరాళ్ల పరిధిలో విరగ్కాసిన పనస కాయలను చూసి గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విరగ్గాసిన పనసతో గిరిజనుడు

ఘనంగా సత్యభామ యువ నృత్యోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ 'సత్యభామ యువ నృత్యోత్సవం' పేరిట నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి వేదికగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న రెండు రోజుల తొమ్మిదో అఖిల భారత నృత్యోత్సవాలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ద డ్యాన్స్ ఇండియా సంపాదకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను గౌరవ అతిథులు ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ సూడగాని రవిశంకర్ నారాయణ్, జాయింట్ కమిషనర్ మహ్మద్ ఆలీ, అదనపు కమిషనర్ శంకర్ పాండీ, ఎస్ఆర్‌కె ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సిఎమ్‌డి ఎంఎస్ఎన్.రాజు, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వీవీ.రమణమూర్తి, కూచిపూడి-సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, అంతర్జాతీయ నృత్యోత్సవ నిర్వహణ నిపుణులు సాయి వెంకటేష్ (కర్ణాటక), జగబంధు జెనా (ఒడిశా) జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూచిపూడి అగ్రహారానికి చెందిన యక్షగాన ప్రవీణుడు వేదాంతం వాగ్దేవీ ప్రసాద్‌కు అతిథులు 'వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి యువపురస్కారం' ప్రదానం చేశారు. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (దుబాయి)కి చెందిన తెన్నేటి శ్రావణికి పద్మశ్రీ డాక్టర్ కె.శోభానాయుడు యువ పురస్కార ప్రదానం జరిగింది. ఎప్పటిలాగే ఏటా ప్రకటించే సత్యభామ బెస్ట్ టీచర్ అవార్డు-2023 అరుణా పరమేష్‌కు దక్కింది. ఈ కార్యక్రమంలో తొలి ప్రదర్శనాంశంగా నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ 'నాట్యశ్రీ' కేవీ.లక్ష్మి శిష్య బృందం ఇచ్చిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

చేజారిపోతున్న గిరిజన భూములు

భయపడి గ్రానైట్ లీజుదారుకు ఆదివాసీలు అమ్మకం
చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
రూ.20 లక్షల భూమిని రూ.8 లక్షలకే విక్రయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కొత్తకోట విలేకరి

అధికారుల తీరుతో కొమిరి గ్రామానికి చెందిన గిరిజనుల భూములు చేజారిపోతున్నాయి. ఓ గ్రానైట్ లీజుదారునికి భయపడి అక్కడి ఆదివాసీలు భూములు అమ్ముకుంటున్నారు. ఎకరా రూ.20 లక్షలు ధర పలికే భూమిని రూ.8 లక్షలకే అమ్ముకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవొచ్చు. వివరాల్లోకి వెళితే..

'ఇది డి ఫారం పట్టా భూమి, అమ్ముట, కొనుట నిషేధం' అని రావికమతం మండలం కొమిరికి చెందిన గిరిజన మహిళ సింగారపు రాజులమ్మ (భర్త చిన్నయ్య) పేరిట మంజూరు చేసిన 1.82 ఎకరాల డి పట్టా భూమికి ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకంపై వుంది. ఆమెకు వి.మాడుగుల మండలం ఉరలోవ రెవెన్యూ, సర్వే నెంబర్ 53/1, పట్టా నెంబర్ 214లో 2012-13లో మెట్ట భూమిపై ప్రభుత్వం డి.పట్టా ఇచ్చింది. డి పట్టా ఇచ్చిన 30 ఏళ్లకు ముందు నుంచీ రాజులమ్మ కుటుంబ సభ్యుల అనుభవంలో ఈ భూమి వుంది. పట్టాలిచ్చే నాటికి జీడిమామిడి తోట నుంచి ఏడాదికి ఎకరంపై దాదాపు 70 వేల వరకు ఫలసాయం పొందుతున్నారు. సోలాం వరలక్ష్మి పేరిట 1.90 ఎకరాలకు ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. ఇలా కొమిరిలో 17 గిరిజన కుటుంబాలకు సుమారు 30 ఎకరాల్లో పట్టాలు లభించాయి. పట్టా భూములకు ఆనుకొని జీడితోటలకు పైనవున్న కొండపై సర్వే నెంబర్ ఒకటిలో ఎం.సుబ్బారెడ్డికి చెందిన శ్రీ సాయిలక్ష్మి నరసింహ గ్రానైట్స్ పేరిట 2019లో 45 ఎకరాల కలర్ గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో గిరిజన కుటుంబాలకు అంతవరకూలేని కొత్త సమస్య ముందుకొచ్చింది. 30 ఏళ్లకుపైగా సాగుచేస్తున్న భూమి తమది కాదని చెబుతున్న గ్రానైట్ లీజుదారులకు రెవెన్యూ అధికారులు తోడవడంతో గిరిజన కుటుంబాల్లో భయం ఏర్పడింది. ఆ భయాన్ని అధికార పార్టీ స్థానిక నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద మనుషులు (మధ్యవర్తులు)గా వ్యవహరించి ఎకరా 20 లక్షల వరకు ధర పలుకుతున్న భూమిని ఎనిమిది లక్షల రూపాయలకు దగ్గరుండి అమ్మిస్తున్నారు.

డి పట్టా భూముల్లో కొండపైకి వేస్తున్న రహదారి

భూములను కాజేసే పథకం ఇలా..

గ్రానైట్ కొండకు ఆనుకొనివున్న గిరిజనుల భూములను తమ చేతిలోకి తీసుకోవాలని లీజుదారు పథకం వేశాడు. తవ్విన గ్రానైట్ నిల్వచేసుకొని, రవాణా చేసేందుకు గిరిజనుల డి పట్టా భూములు అవసరమని గుర్తించాడు. 30 ఏళ్లకుపైగా సాగులోవుండి, పట్టాలు పొందిన గిరిజనులను భూమి నుంచి బయటకు పంపడం సాధ్యంకాలేదు. అందుకని రెవెన్యూ అధికారులతో కలిసి లీజుదారు కొత్త పథకం పన్నారు. ఇంతవరకు సాగుచేస్తున్న భూమి మీదికాదని, ప్రభుత్వం మంజూరు చేసిన భూమి మరోచోట వుందని గిరిజనులకు చెప్పడం ఆరంభించారు. ఇది నిజమని నమ్మిన గిరిజనులు తమకు వేరోచోటైనా భూమి అప్పగించాలని కోరారు. వాస్తవానికి గిరిజనులకు సాగుచేసిన భూమిపై ప్రభుత్వం పట్టాలు మంజూరుచేయడంతో రెవెన్యూ అధికారులు ఇక్కడ నుంచి వెళ్లగొట్టి వేరేచోట భూమి చూపించే సాహసం చేయలేకపోయారు. మరో మార్గంలేక అక్కడ నుంచి భూమి వదిలి వెళ్లాలని గిరిజనులను లీజుదారు భయపెట్టడం ప్రారంభించారు. లీజుదారుకు రెవెన్యూ అధికారులు సహకరించడంతో చేసేదిలేక ఇచ్చిన డబ్బులకు అమ్ముకోవడానికి గిరిజనులు సిద్ధపడ్డారు. 30 ఏళ్లకు పైబడి భూమిని అంటిపెట్టుకొని సాగుచేసిన రాజులమ్మ తమ భూమిపోతుందని భయపడి ప్రభుత్వమిచ్చిన పట్టా భూమిని ఎకరా ఎనిమిది లక్షల రూపాయలకు అమ్ముకుంది. కొండకింద తన కూతురు తోకల రాజులమ్మ సాగులోనున్న మూడెకరాల పల్లపు భూమిలో ఎనిమిది లక్షల రూపాయలు చొప్పున ఎకరన్నర భూమి అమ్ముకున్నట్లు రాజులమ్మ 'ప్రజాశక్తి' వద్ద వాపోయింది. గిరిజనుల నుంచి డి పట్టా భూములు ఆరెకరాలు కొని రహదారి వేసుకొని, గ్రానైట్ నిల్వకు భూమిని లీజుదారు చదునుచేయించాడు.

పైన గ్రానైట్ తవ్వకాలు జరిగితే కొండకింద భూముల్లోని జీడితోటలు, పల్లపు భూమి పంటలు పాడవుతాయని గిరిజనులు చెబుతున్నారు. పంట పొలాలపైకి దుమ్మువస్తే దిగుబడులు రావని వరలక్ష్మి భర్త రాజు అన్నాడు. గిరిజన రైతుల అంగీకారంతో భూములు కొన్నట్లు గ్రానైట్ ప్రతినిధులు చెబుతున్నారు. గిరిజనులను భయపెట్టి లీజుదారు కొనుగోలు చేస్తున్న భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించడంలేదు. హక్కుదారులైన గిరిజనులను భూమి నుంచి వెళ్లగొట్టేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు, లీజుదారుడు ఒక్కటయ్యారని, గిరిజనులకు హక్కులు కల్పించాల్సిందిపోయి, పట్టాదారు పాస్ పుస్తకాలు ఇక్కడవి కాదని చెప్పడం అన్యాయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావు అన్నారు.

అధికారం కోసమే బిజెపి కుయుక్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకే ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని తాజాగా తెరపైకి తెచ్చిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవి.సత్యనారాయణమూర్తి విమర్శించారు. శనివారం అల్లిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల్లో పరాభవం తరువాత బిజెపి గ్రాఫ్ పడిపోతున్న విషయాన్ని బిజెపి నాయకత్వం గ్రహించి ఎన్‌డిఎ సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్నట్టు మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ఆపలేని ప్రధాని మోడీ ఉక్రెయిన్, రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపుతాననడం విడ్డూరమన్నారు. అబద్ధాలు, కుట్రలతో వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు మోడీ పన్నాగం పన్నుతున్నారని దుయ్యబట్టారు.

సిఐ స్వర్ణలతపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు

- ఈ నెల 21 వరకూ రిమాండ్
- 2 వేల నోట్ల మార్పిడి కేసులో వెలుగులోకి కీలక విషయాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2 వేల నోట్ల మార్పిడి కేసులో ప్రధాన నిందితురాలుగా ఉన్న ఎఆర్ సిఐ స్వర్ణలత విషయంలో కేసు విచారణ సాగుతున్న కొద్దీ విస్మయంగొలిపే విషయాలు బయటకొస్తున్నాయి. తాజాగా ఆమెపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదయ్యాయి. ఈ నెల 21 వరకూ కోర్టు రిమాండ్ విధించింది. స్వర్ణలత ఆంధ్రా పోలీస్ ఆఫీసర్ల సంఘానికి ఉపాధ్యక్షురాలిగా కూడా ఉంటూ కొందరు పొలిటీషియన్లతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. తాజాగా కొందరిని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారామె. ఆమె ఫాలో అయిన విధానం కూడా చాలా సినిమాటిక్‌గా ఉంది. 2 వేల నోట్ల మార్పిడికి ఆర్‌బిఐ అవకాశం ఇచ్చాక దాన్ని కూడా ఓ ఆదాయ వనరుగా ఆమె మార్చుకున్నారు. ఓ వ్యక్తిని బెదిరించి ఇటీవల అక్షరాలా రూ.12 లక్షలను ఆమె సహా నలుగురు ఎలా కొట్టేసారో అందరికీ తెలిసిందే. విచారణలో ఇదంతా బయటపడటంతో ఆమెపై కేసులు నమోదయ్యాయి. కోర్టులో ఆమెను హాజరుపరచగా న్యాయస్థానం ఆమెతో పాటు ఆమెకు సహకరించిన నలుగురు వ్యక్తులకు ఈ నెల 21 వరకు రిమాండ్ విధించింది. ఇదిలా ఉంటే స్వర్ణలతపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. యూనిఫామ్‌లో వెళ్లి సివిల్ కేసుల సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్నాయి. వ్యవహారం స్టేషన్ దాకా రాకుండానే అనేక కేసులు క్లోజ్ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అనేక మంది సిఐలు కూడా ఆమెను సెటిల్‌మెంట్లకు వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్వర్ణలత (ఫైల్ ఫొటో)

స్వర్ణలతను ఎ1 ముద్దాయిగా చేర్చాలి

కలెక్టరేట్ : నోట్లు మార్పిడి వ్యవహారంలో కీలకంగా వ్యవహరించి రూ.15 లక్షలను దోచుకున్న సిఐ స్వర్ణలతను ఈ కేసులో అరెస్టు చేసినప్పటికీ ఆమెను ఎ 4గా పేర్కొనడం సరికాదని, ఎ1గానే ఎఫ్ఐఆర్‌లో పేర్కొనాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వర్ణలత పోలీసు అధికారిగా ఉన్నప్పటికీ అధికార వైసిపి కార్యకర్తగా పనిచేశారని ఆరోపించారు. సమావేశంలో తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి గనగళ్ల సత్యవతి, నాయకులు లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుము రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : రుషికొండ బీచ్‌లోకి వెళ్లే వారికి రూ.20 ప్రవేశ రుసుము విధించడాన్ని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో శనివారం తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణం ఈ ప్రజా వ్యతిరేక చర్యను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రుషికొండ బీచ్‌లో పార్కింగ్ చేసే ద్విచక్ర వాహనానికి రూ.10, కార్లకు రూ.30, బస్సులకు రూ.50 వసూలు చేస్తున్నారన్నారు. మరోవైపు ఎంవిపిలో వున్న హెల్త్ ఎరీనాకు కూడా విఎంఆర్‌డిఎ ప్రవేశ రుసుం పెట్టిందని తెలిపారు. అలాగే జివిఎంసి ఇటీవల ఎంవిపిలో రూ.25 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రైవేటుపరం చేశారని అన్నారు. ముడసర్లోవ పార్కును, 280 ఎకరాల భూమిని కూడా తమ అనుయాయులకు పిపిపి పేర వైసిపి ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకంగా విశాఖ పోర్టు ఇండోర్ ఆడిటోరియం, కళావాణి, క్వార్టర్స్‌ను ప్రైవేట్‌పరం చేసిందన్నారు. త్వరలో ఆర్‌కె.బీచ్‌కి కూడా ప్రవేశ రుసుం ఏర్పాటు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ప్రజల ఉమ్మడి ఆస్తులు, పర్యాటక ప్రాంతాలను అధికార వైసిపి ప్రభుత్వం అడ్డగోలుగా బడా రాజకీయ కాంట్రాక్టర్లకు అప్పనంగా ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ దుర్మార్గ చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

గంటా ఆగ్రహం

బీచ్‌ల వద్ద పార్కింగ్ ఫీజులు, ఎంట్రీ ఫీజులు విధించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మండిపడ్డారు. వెంటనే పునారాలోచన చేసి, నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

వ్యాపారీకరణ తగదు : వార్వా

రుషికొండ బీచ్‌లో ప్రవేశానికి రుసుము రూ.20 వసూలు చెయ్యాలనే నిర్ణయాన్ని వార్వా, నివాస్ ప్రధాన కార్యదర్శులు బిబి.గణేష్, పిట్టా నారాయణమూర్తి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విశాఖపట్నంలోని బీచ్‌లను వ్యాపారీకరణ చెయ్యొద్దని జివిఎంసిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.